



• కోనసముందర్‌లో నీటికుండీని పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌వో



• మందుల కోసం రోగుల క్యూ

వ్యాధుల పంజా

- జిల్లాలో విస్తరిస్తున్న సీజనల్ వ్యాధులు
- పెరుగుతున్న డెంగీ, మలేరియా కేసులు
- ఆస్పత్రుల్లో కిక్కిరిసిపోతున్న రోగులు
- నిలువునా దోచేస్తున్న ప్రైవేటు ఆస్పత్రులు

నిజామాబాద్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో సీజనల్ వ్యాధులు పంజా విసురుతున్నాయి. డెంగీ, మలేరియా, టైఫాయిడ్ జ్వరాలు విస్తరించడంతో ఆసుపత్రులన్నీ రోగులతో నిండిపోతున్నాయి. జ్వర బాధితులు వణికిపోతూ మంచం పడుతున్నారు. జలుబు, దగ్గుతోపాటు ఇతర లక్షణాలు ఉండడంతో అనేక మంది ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. దీంతో ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు రోగులతో కిటకిటలాడుతున్నాయి. వ్యాధుల తీవ్రత ఎక్కువగా ఉండటం వల్ల ప్రభుత్వ ఆసుపత్రుల్లోనూ ఓపీ సంఖ్య ఎక్కువగా ఉంటుంది. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఓపీలు రాష్ట్ర స్థాయిలో ఎక్కువ మంది రోగులు వస్తున్నారు. ప్రతిరోజూ గంటల తరబడి ఆసుపత్రిలో ఉండి చికిత్స తీసుకుంటున్నారు. వర్షాలు పడటం, దోమలు పెరగడం వల్ల ఈ వ్యాధుల తీవ్రత ఎక్కువగా ఉందని వైద్య నిపుణులు విశ్లేషిస్తున్నారు. దోమల నివారణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని, పరిసరాల్లో నీటి నిల్వలు ఉండకుండా చూసుకుంటే జ్వరాలు తగ్గుతాయని వారు వివరిస్తున్నారు.

రక్తనమూనాల సేకరణ

జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో పాటు వివిధ ఏజెన్సీలు నిర్వహించిన సర్వేల వల్ల డెంగీ, టైఫాయిడ్‌తో పాటు ఇతర వ్యాధులు బయట పడుతున్నాయి. గడిచిన 20 రోజులుగా జిల్లాలో ప్రతిరోజూ పది నుంచి ఇరవై వరకు డెంగీ కేసులు బయటపడుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా జూన్‌లో మొత్తం 66వేల 724 రక్త నమూనాలను సేకరించారు. జూన్ నెలలోనే జ్వరాలకు సంబంధించి మూడువేలకు పైగా కేసులను గుర్తించారు. ఈనెలలో డెంగ్యూ కేసులు 33 నమోదు కాగా ఇతర కేసులు ఎక్కువగా బయటపడ్డాయి. జూలై నెలలో జిల్లాలో మొత్తం 82వేల 201 రక్త నమూనాలను అధికారులు సేకరించారు. వీటిలో పది డెంగ్యూ కేసులు బయటపడగా సుమారు 3,500 మందికి జ్వరాలతో పాటు ఇతర వ్యాధులు వచ్చినట్లు గుర్తించారు. జిల్లాలో ఆగస్టు నెలలో ఇప్పటి వరకు 89,309 రక్త నమూనాలను సేకరించి తెలంగాణ హబ్‌కు పంపించారు. వీటిలో ఇప్పటి వరకు 161 డెంగీ కేసులను గుర్తించారు. ఇవేకాకుండా సుమారు 4వేల మంది వరకు సాధారణ జ్వరాలతో పాటు ఇతర వ్యాధులు వచ్చి చికిత్స పొందుతున్నట్లు నిర్ధారించారు.

అత్యధికంగా ఓపీ కేసులు

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో రాష్ట్ర స్థాయిలోనే అత్యధికంగా ఓపీ కేసులు వస్తున్నాయి. ఈ ఆసుపత్రిలో ప్రతిరోజూ 2600 నుంచి 2850 వరకు ఓపీ కేసులు నమోదవుతున్నాయి. జిల్లాలోని పలు గ్రామాల నుంచే కాకుండా మహారాష్ట్ర, కామారెడ్డి, నిర్మల్, జగిత్యాల జిల్లాల నుంచి కూడా రోగులు ఈ ఆసుపత్రికి వస్తున్నారు. ప్రస్తుతం 15 మంది డెంగీ బాధితులు ఈ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వీరితో పాటు మరి కొంత మంది టైఫాయిడ్ వచ్చిన వారు కూడా ఈ ఆసుపత్రిలో చేరి చికిత్స తీసుకుంటున్నారు. ఇవేకాకుండా బోధన్, జిల్లా కేంద్ర ఆసుపత్రి, ఆర్మూర్‌లోని ఆసుపత్రితో పాటు ఇతర పీహెచ్‌సీలో కూడా గత నెలన్నర రోజుల నుంచి కూడా రోగుల సంఖ్య పెరిగింది. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఓపీ సంఖ్య భారీగా పెరిగిందని సూపరింటెండెంట్ డాక్టర్ ప్రతిమరాజ్ తెలిపారు. జిల్లాలో వ్యాధుల తీవ్రత ఎక్కువ గానే ఉందని జిల్లా మలేరియా అధికారి తుకారాం రాథోడ్ తెలిపారు. ప్రతిరోజూ 10 నుంచి 18 వరకు డెంగీ కేసులు వస్తున్నాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ దోమల నివారణకు చర్యలు తీసుకుంటే రోగాల తీవ్రత తగ్గుతుందని తెలిపారు.

చికిత్స పేరిట 'ప్రైవేట్' దోపిడీ

జిల్లాలో సీజనల్ వ్యాధులు ఎక్కువ కావడంతో ప్రైవేట్ ఆసుపత్రులకు వచ్చే రోగుల సంఖ్య పెరిగింది. దీంతో చికిత్స పేరిట వేలకు వేలు వసూలు చేస్తున్నారు. జిల్లాలో కొన్నేళ్లుగా ర్యాపిడ్ టెస్టు ద్వారానే ప్రైవేటు ఆసుపత్రుల్లో డెంగీ నిర్ధారణ చేస్తున్నారు. వారి నుంచి వేలకు వేల ఫీజులను వసూలు చేస్తున్నారు. సాధారణ జ్వరాలు, జలుబుతో వచ్చేవారిని కూడా ప్రైవేటు ఆసుపత్రులు వదలడం లేదు. వారికి వివిధ రకాల పరీక్షలు నిర్వహిస్తూ ఎక్కువ మొత్తంలో డబ్బులను వసూలు చేస్తున్నారు. రోజుల తరబడి ఆసుపత్రుల్లో ఉంచుతున్నారు. ప్రైవేటు ఆసుపత్రుల్లోని సేవలపై నజర్ పెట్టాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశాలు జారీ చేసినా జిల్లాలో మాత్రం ఇంకా పూర్తిస్థాయిలో తనిఖీలు లేవు. ప్రైవేటు ఆసుపత్రులపై పర్యవేక్షణ కొరవడడంతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి..

• డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో

కమ్మర్‌పల్లి: ప్రతిఒక్కరూ పరిసరాల శుభ్రత పాటిస్తేనే దోమల నివారణ సాధ్యమని దాంతో రోగాలు దరిచేరవని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో రమేష్ అన్నారు. శుక్రవారం మండలంలోని కోనాసమందర్‌లో ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలోని కొన్ని ఇళ్లను సందర్శించి నీటి నిలువకుండీలను పరిశీలించారు. అలాగే చౌట్‌పల్లి ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ చేశారు. రోగులకు అందుతున్న వైద్య సేవలను స్థానిక వైద్యురాలు సుప్రియను అడిగి తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం ఆసుపత్రి రికార్డులను, మందుల స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించారు. ఆయన వెంట ఆర్మూర్ డివిజన్ మలేరియా నివారణ అధికారి సాయి, వైద్యసిబ్బంది, ఆశావర్కర్లు ఉన్నారు.



జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రిలో జ్వర బాధితులు ఇలా..

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి..

వేల్పూర్: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ శరత్‌చంద్ర సూచించారు. మండలంలోని పచ్చలనడ్కుడ గ్రామంలో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శుక్రవారం ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శరత్‌చంద్ర సీజనల్ వ్యాధులు, ఫ్రైడే డ్రైడే వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం వివిధ సీజనల్ వ్యాధులతో ఉన్న వారిని గుర్తించి వారిని చికిత్సలు నిర్వహించి మందులను అందజేశారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ తబిత, ఏఎన్‌ఎంలు విజయ లలిత, ప్రియ దర్శిని, సీహెచ్‌వో నారాయణ, ఎంఎల్ హెచ్‌వో అర్చన, ఆశా వర్కర్‌లు ఉన్నారు.



పచ్చలనడ్కుడలో వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

60 టీఎంసీలకు ఎస్సారెస్పీ నీటి మట్టం

• కాలువలకు కొనసాగుతున్న నీటి విడుదల

మెండోర, ఆగస్టు 30: శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి 60టీఎంసీలకు పైగా నీరు చేరడంతో వానాకాలం, యాసంగి సాగుకు ఢోకా లేదని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సీజన్ జూన్ ఒకటో తేదీ నుంచి ప్రాజెక్టు ఎగువ ప్రాంతంలో విష్ణుపురి, బాలేగావ్, బాబ్లీ ప్రాజెక్టుల నుంచి వరద భారీగా రావడంతోపాటు ప్రాజెక్టు పరిసర ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు వరద భారీగా చేరుకోవడంతో ప్రాజెక్టు నీటిమట్టం 60 టీఎంసీలకు దాటింది. దీంతో ఎస్సారెస్పీ జలకళను సంతరించుకుంది. ప్రాజెక్టులోకి 10807టీఎంసీల వరద వచ్చి చేరుతుందని ప్రాజెక్టు ఏఈఈ వంశీ తెలిపారు. ఉదయం ప్రాజెక్టులోకి 8503 క్యూసెక్కుల వరదనీరు చేరగా సాయంత్రానికి ప్రాజెక్టులోకి 10807క్యూసెక్కుల వరద పెరిగింది. దీంతో ప్రాజెక్టు నీటిమట్టం క్రమంగా పెరుగుతుంది. ప్రాజెక్టు నుంచి కాకతీయ, లక్ష్మీ, సరస్వతి కాలువలకు నీటి విడుదల కొనసాగుతోంది. ప్రాజెక్టు నుంచి కాకతీయ కాలువకు 4వేల క్యూసెక్కులు, లక్ష్మీకాలువకు 50క్యూసెక్కులు, సరస్వతి కాలువకు 500క్యూసెక్కులు, అవిరి రూపంలో 594 క్యూసెక్కులు, మిషన్ భగీరథ తాగునీటి కోసం 231 క్యూసెక్కుల నీటి విడుదల జరుగుతుందని తెలిపారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1091అడుగులు (80.5 టీఎంసీ)లు కాగా శుక్రవారం సాయంత్రానికి 1085.1 అడుగులు (60.118టీఎంసీ)లు నీటి నిల్వ ఉంది. గత ఏడాది ఇదే రోజున ప్రాజెక్టులో 1090.60అడుగులు (78.868 టీఎంసీ)ల నీటి నిల్వ ఉందని అధికారులు తెలిపారు.



• ప్రాజెక్టులో ప్రస్తుత నీటి నిల్వ ఇలా..

ఇంటర్‌లో డిలీట్ ఆప్షన్‌కు నేడే చివరి రోజు

నిజామాబాద్ అర్బన్, ఆగస్టు 30: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు, ఇతర అన్ని రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలల్లో ఇంటర్ ఫస్టియర్‌లో చేరి ఇతర కళాశాలల్లో చేరేందుకు గాను డిలీట్ ఆప్షన్ ఆగస్టు 31వ తేదీ ఒక్కరోజు మాత్రమే ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంటుందని డీఐఈవో రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రైవేటు జూనియర్ కళాశాలల యాజమాన్యాలు లేదా ప్రిన్సిపాళ్లు తమ కళాశాలల్లో చేరిన విద్యార్థులు ఇతర కళాశాలల్లో చేరడానికి విద్యార్థుల కోరిక మేరకు అడ్మిషన్ డిలీట్ చేయాలని ఆయన ఆదేశించారు. విద్యార్థులు తమ ఇష్టమైన కళాశాలల్లో లేదా ఇతర గ్రూపుల్లో చేరేందుకు అవకాశం కల్పించాలన్నారు. ప్రైవేటు కళాశాలలు విద్యార్థుల డిలీట్ ఆప్షన్ చేయకుండా వారి వద్ద ఫీజులు, ఇతర ఎలాంటి ఇబ్బందులకు గురి చేసినా శాఖపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరంలో అడ్మిషన్ పొందడానికి సెప్టెంబర్ 7వ తేదీ వరకు అవకాశం ఉందని ఈ అవకాశాన్ని జిల్లాలోని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

హెచ్‌సీఎల్, టెక్‌బీల ఆధ్వర్యంలో జాబ్‌మేళా..

జిల్లా కేంద్రంలోని గిరిరాజ్ కళాశాలలో హెచ్‌సీఎల్, టెక్‌బిల ఆధ్వర్యంలో శుక్రవారం జాబ్‌మేళా నిర్వహించారు. ఈ జాబ్‌మేళాకు ఇంటర్మీడియెట్ బైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీ, వొకేషన్‌లలో వివిధ కోర్సులు పూర్తి చేసిన ఇంటర్మీడియెట్ పూర్తయిన విద్యార్థులు 60 మందికి పైగా పాల్గొన్నారు. ఎంపికైన విద్యార్థులకు శిక్షణతో పాటు ఉన్నత విద్య అందించడం జరుగుతుందని సంస్థ ప్రతినిధి రాజేష్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఐఈవో రవికుమార్, గిరిరాజ్ కళాశాల ప్రిన్సిపాల్ రామ్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కోస్లిలో పంప్‌హౌస్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

అలీసాగర్ ఆయకట్టుకు నీటి విడుదల

- రైతులు పొదుపుగా నీటిని వాడుకోవాలి
- బోధన్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి పి.సుదర్శన్‌రెడ్డి
- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతుతో కలిసి ఆయకట్టుకు నీటిని విడుదల చేసిన ఎమ్మెల్యే

నవీపేట, ఆగస్టు 30: రాష్ట్ర ప్రభుత్వం రైతులను ఆదుకునేందుకు ఎత్తిపోతల పథకాల ద్వారా ఆయకట్టుకు నీటిని అందిస్తుందని మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే పి.సుదర్శన్‌రెడ్డి అన్నారు. నవీపేట మండలం కోస్లి వద్ద అలీసాగర్ ఎత్తిపోతల పథకం పంప్‌హౌజ్‌లకు శుక్రవారం జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతుతో కలిసి పూజలు నిర్వహించి ఆయకట్టుకు నీటిని విడుదల చేశారు. గోదావరిలో అలిసాగర్ ఇంటేక్‌వెల్ వద్ద నీటినిల్వలు తక్కువగా ఉన్నందున రైతులు పొదుపుగా నీటిని వాడుకోవాలన్నారు. ఆయకట్టు పరిధిలోని రైతులు ఇబ్బందులు పడకుండా ఉండేందుకే ఈ నీటిని విడుదల చేశామన్నారు. పంటలకు అవసరం ఉన్నంతవరకే నీటిని వినియోగించాలన్నారు. రైతాంగం ప్రయోజనాలను కాపాడేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని ఆయన అన్నారు. ప్రభుత్వం రైతులను ఆదుకునేందుకే రుణమాఫీ చేసిందన్నారు. ప్రతి రైతుకు రెండులక్షల లోపు రుణం మాఫీ అయ్యిందన్నారు. వివిధ కారణాల వల్ల రుణమాఫీ కాని రైతుల నుంచి విజ్ఞప్తులను అధికారులు స్వీకరిస్తున్నారని అన్నారు. వాటిని పరిశీలించి అర్హులైన వారందరికీ రుణమాఫీ అయ్యే విధంగా అధికారులు చర్యలు తీసుకుంటారని తెలిపారు. పలు సహకార సంఘాల్లో పంట రుణాల మాఫీలో అవకతవకలు జరిగినట్లు తమ దృష్టికి వచ్చిందని ఆయన అన్నారు. సంబంధిత అధికారులతో విచారణ జరిపి చర్యలు తీసుకుంటామన్నారు. అక్రమాలు వాస్తవం అయితే బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. గత కొన్ని రోజులుగా గుర్తుతెలియని వ్యక్తులు ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి కాపర్ కాయిల్స్‌ను చోరీ చేస్తున్నారని ఆయన అన్నారు. దీని వల్ల పంప్‌సెట్‌లు పనిచేయక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల చోరీలను నివారించేందుకు ట్రాన్స్‌కో అధికారులతో పాటు పోలీసులు గట్టి నిఘా ఉంచాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడుగు గంగాధర్, నీటిపారుదల శాఖ ఎస్ఈ గంగాధర్, ఏఈ ప్రణయ్, మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్‌గౌడ్‌తో పాటు అధికారులు పాల్గొన్నారు.





ఓటరు నమోదుకు మరో అవకాశం

• అక్టోబరు 18 వరకు దరఖాస్తుల స్వీకరణ • జిల్లాలో 14లక్షల 19వేల 769 మంది ఓటర్లు

నిజామాబాద్ అర్బన్, ఆగస్టు 30: స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఎన్నికల కమిషన్ కొత్త ఓటర్ల నమోదుకు శ్రీకారం చుట్టింది. 2025 జనవరి 1నాటికి 18ఏళ్లు పూర్తయిన వారందరూ ఓటర్లుగా నమోదు చేసుకోవడానికి అర్హులుగా ప్రకటిస్తూ ఎన్నికల కమిషన్ తెలిపింది. కొత్త ఓటర్ల నమోదుతో పాటు నియోజకవర్గాల మార్పు, ఓటరు జాబితాలో తప్పుల సవరణ, ఓటరు కార్డుకు ఆధార్ అనుసంధానం, జాబితా నుంచి పేరు తొలగింపు, తదితర సవరణలకు అవకాశం కల్పించనుంది. ఈనెల 20 నుంచి బూత్‌స్థాయి అధికారులు ఇంటింటికీ తిరుగుతూ ఓటరు జాబితాపై వివరాలను సేకరించనున్నారు.

జిల్లాలో 14,19,769 మంది ఓటర్లు

జిల్లాలో పార్లమెంట్ ఎన్నికల నాటికి ఆరు నియోజకవర్గాల పరిధిలో 14లక్షల 19వేల 769 మంది ఓటర్లు ఉన్నారు. ఆర్మూర్ నియోజకవర్గంలో 217 పోలింగ్ బూత్‌లలో మొత్తం 2లక్షల 12వేల 145 మంది ఓటర్లు ఉండగా ఇందులో పురుష ఓటర్లు 98వేల 737, మహిళా ఓటర్లు లక్షా 13వేల 401 మంది, ఇతరులు ఏడుగురు ఉన్నారు. బోధన్ నియోజకవర్గంలో 246 పోలింగ్ బూత్‌లలో 2లక్షల 23వేల 96 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుష ఓటర్లు లక్షా 6వేల 372 మంది కాగా, మహిళా ఓటర్లు లక్షా 16వేల 719, ఇతరులు ఐదుగురు ఉన్నారు. బాన్సువాడ నియోజకవర్గ పరిధిలో 258 పోలింగ్ బూత్‌లు ఉండగా మొత్తం లక్షా 96వేల 826 ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుష ఓటర్లు 93వేల 762, మహిళా ఓటర్లు లక్షా 3వేల 51 మంది, ఇతరులు 13 మంది ఉన్నారు. నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గంలో 289 పోలింగ్ బూత్‌లకు గాను 3లక్షల 4వేల 317 మంది ఓటర్లు ఉండగా పురుష ఓటర్లు లక్షా 46వేల 757, మహిళా ఓటర్లు లక్షా 57వేల 519 ఉన్నారు. ఇతరులు 41 మంది ఓటర్లు ఉన్నారు. నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలో 293 పోలింగ్ బూత్‌లలో మొత్తం 2లక్షల 56వేల 593 మంది ఉండగా ఇందులో పురుష ఓటర్లు లక్షా 19వేల 769, మహిళా ఓటర్లు లక్షా 36వేల 818 ఉండగా, ఇతరులు ఆరుగురు ఉన్నారు. బాల్కొండ నియోజకవర్గ పరిధిలో 247 పోలింగ్ బూత్‌లకు గాను మొత్తం 2లక్షల 26వేల 792 ఓటర్లు ఉండగా మహిళా ఓటర్లు లక్షా 22వేల 68 మంది, పురుష ఓటర్లు లక్షా 4వేల 721 ఉన్నారు. ఇతరులు ముగ్గురు ఉన్నారు.

తప్పులు లేకుండా..

తప్పులకు ఆస్కారం లేకుండా ఓటరు జాబితాను రూపొందించేందుకు ఎన్నికల సంఘం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో జిల్లా యంత్రాంగం ఓటరు జాబితాలో ఎలాంటి తప్పులకు ఆస్కారం లేకుండా జాబితాను రూపొందించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. కొత్తగా ఓటరు నమోదుకు ఫారం-6ను, ఓటరు కార్డు ఆధార్‌కు అనుసంధానం చేసేందుకు ఫారం-6బిను, ఓటరు జాబితా నుంచి పేరు తొలగించేందుకు ఫారం-7 ను, తప్పు ఒప్పుల సవరణకు ఫారం-8 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని అధికారులు కోరుతున్నారు.

షెడ్యూల్ ఇలా...

ఈనెల 20 నుంచి అక్టోబర్ 18 వరకు ఓటర్ల నమోదు, మార్పులు చేర్పులపై దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. ఈనెల 28లోగా కొత్త దరఖాస్తుల పరిశీలన మార్పుల చేర్పుల అనంతరం ఈనెల 29న ముసాయిదా జాబితాను విడుదల చేస్తారు. నవంబర్ 28 వరకు ముసాయిదాపై అభ్యంతరాలను స్వీకరిస్తారు. బూత్ స్థాయి అధికారులు ఇంటింటి పరిశీలన చేస్తారు. బోగస్ ఓట్లను తొలగిస్తారు. జనవరి 6, 2025న తుది ఓటరు జాబితాను ప్రకటిస్తారు. ఓటరు జాబితా సవరణలో భాగంగా బూత్‌స్థాయి అధికారులు ఇంటింటి పరిశీలన చేస్తున్నారు. ఒకే ఇంటి నెంబర్‌పై ఆరు ఓట్లు ఉంటే క్షుణ్ణంగా పరిశీలన చేయాలని స్పష్టమైన ఆదేశాలు వచ్చాయి. తప్పు ఒప్పులకు ఆస్కారం లేకుండా ఓటరు జాబితాను పక్కాగా రూపొందించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.



ముప్కాల్‌లో ఓటరు జాబితాను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ అంకిత్

'ఆర్ఎంపీలు పరిధి దాటి చికిత్స చేయొద్దు'

దోమకొండ, ఆగస్టు30: ఆర్ఎంపీలు పరిధి దాటి చికిత్స చేయవద్దని వైద్యాధికారి భానుప్రియ అన్నారు. మండల కేంద్రంలోని మెడికల్ షాప్‌లు, ఆర్ఎంపీల ప్రాక్టీస్ సెంటర్‌లను ఎంపీడీవో ప్రవీణ్ కుమార్‌తో కలిసి శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆర్ఎంపీలు వివిధ గ్రామాల్లో తమ పరిధిలోని ప్రథమ చికిత్సలు అందించాలని, పరిధి దాటి చికిత్సలు చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

హెల్మెట్‌ను తప్పనిసరిగా ధరించాలి

భీమ్‌గల్, ఆగస్టు 30: ద్విచక్రవాహనదారులు హెల్మెట్‌ను ధరించి ప్రాణాలు సురక్షితంగా ఉంచుకోవాలని భీమ్‌గల్ సీఐ నవీన్‌కుమార్ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని బడాభీమ్‌గల్ చౌరస్తా వద్ద యువకులకు, వాహనదారులకు హెల్మెట్ ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. మైనర్లు వాహనాలు నడిపితే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్సై మహేష్, ఎఎస్సై చిరంజీవి, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులను ప్రదానం చేస్తున్న ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్

క్రీడలకు ప్రభుత్వ ప్రోత్సాహం

● ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్

బాన్సువాడటౌన్, ఆగస్టు 30: గ్రామీణప్రాంత క్రీడాకారులకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందని, క్రీడల్లో క్రీడాకారులు తమ సత్తాను చాటాలని రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ప్రొ.జయశంకర్ క్రీడా మైదానంలో నిర్వహించిన బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీఒక్కరు చదువుతోపాటు క్రీడలలో కూడా రాణించి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, మండల విద్యాధికారి నాగేశ్వరరావు, దుద్దాల అంజిరెడ్డి, గోపాల్‌రెడ్డి, పిట్ల శ్రీధర్, నార్ల ఉదయ్, వెంకటేశ్, కిరణ్, నర్సింగ్‌రావు తక్కెడపల్లి, బాబా, ఖాలేక్, హకీం తదితరులున్నారు.

రుణమాఫీ కోసం కుటుంబ సభ్యుల నిర్ధారణ పక్కాగా చేపట్టాలి

సదాశివనగర్, ఆగస్టు 30: రుణమాఫీ కోసం రేషన్‌కార్డులేని వారి కుటుంబ సభ్యుల వివరాలను పక్కాగా చేపట్టాలని జిల్లా వ్యవసాయా అధికారి తిరుమల ప్రసాద్ అన్నారు. మండల కేంద్రంలో వ్యవసాయాధికారి ప్రజాపతి కుటుంబసభ్యుల నిర్ధారణ కార్యక్రమాన్ని చేపడుతున్న సందర్భంగా డీఏఓ ఆకస్మిక తనిఖీచేశారు. కార్యక్రమంలో ఏఈవో కవిత ఉన్నారు.

రుణమాఫీ కాని రైతుల వివరాల సేకరణ

బిచ్కుంద: రాష్ట్రప్రభుత్వం రైతులకు ప్రకటించిన రెండు లక్షల రుణమాఫీ మూడువిడుతలలో రాని రైతుల వివరాలను మండల వ్యవసాయాధికారి సేకరించారు. శుక్రవారం మండల కేంద్రంలోని కెనరా బ్యాంక్‌లో రుణాలు ఎంతమంది పొందారు.. ఎంతమంది రైతులకు మాఫీ వచ్చింది.. రాని వారు ఎంతమంది రైతులు ఉన్నారో అనే వివరాలు తెలుసుకున్నారు. బ్యాంక్ అకౌంట్, ఆధార్‌కార్డు, పట్టాపాసుబుక్‌లలో పొరపాటు ఉంటే వివరాలతో రుణమాఫీ కోసం వ్యవసాయ అధికారులకు దరఖాస్తులు అందించాలని తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

● జిల్లా అదనపు కలెక్టర్ అంకిత్

ముప్కాల్, ఆగస్టు 30: అంతటా విషజ్వరాలు ప్రబలుతున్నాయని, సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని అదనపు కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం బాల్కొండ, ముప్కాల్ మండల కేంద్రంలో పర్యటించిన ఆయన ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాలను తనిఖీ చేశారు. సీజనల్ వ్యాధుల వ్యాప్తికి చేపట్టే చర్యలపై ఆరా తీశారు. నివాస ఇళ్లవద్ద నీరు నిల్వఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. చికెన్‌గున్యా, డెంగ్యూ, మలేరియా సోకకుండా ఫాగింగ్ చేయాలని సూచించారు. ఎలక్షన్ కమీషన్ ఆదేశాల మేరకు ముందస్తు చర్యల్లో భాగంగా బీఎల్‌వోల ఇంటింటి సర్వే చేస్తున్నారా అని పేర్కొన్నారు. ఓటర్‌లిస్టులో తప్పులు లేకుండా ఇంటింటికీ తిరిగి ఓటరు లిస్టు తయారుచేయాలని సూచించారు. అమ్మ ఆదర్శ స్కూళ్లను తనిఖీచేసి వారం రోజుల్లోగా మిగిలిఉన్న పనులను పూర్తిచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో విజయభాస్కర్, ముజారుద్దిన్, తహసీల్దార్ శ్రీధర్, శ్రీకాంత్, ఇన్‌చార్జీ కార్యదర్శులు, బీఎల్‌వోలు ఉన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ఆర్మూర్‌రూరల్: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఇంటి పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని గోవింద్‌పేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ మానస అన్నారు. శుక్రవారం ఫ్రైడే డ్రైడేలో భాగంగా పరిసరాల పరిశుభ్రత, సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఇంటి పరిసరాల్లో పాత కుండిలు, పనికి రాని వస్తువులు ఉండకుండా చూడాలని అన్నారు. వాటిలో వర్షపు నీరు పడి దోమలు లార్వ వృద్ధి చెంది మలేరియా, డెంగ్యూ, చికెన్‌గున్యా, ఫైలేరియా వంటి వ్యాధులు ప్రబలుతాయన్నారు. దోమల వల్ల సోకే వ్యాధులపై, దోమల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు జక్కుల మోహన్, శ్యామల, ఎస్తెర్ రాణి, గణేష్, తదితరులు ఉన్నారు.

● వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

భీమ్‌గల్ రూరల్: గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రజలకు అవగాహన కల్పించాలని భీమ్‌గల్ ఎంపీడీవో సంతోష్ కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని దేవన్‌పల్లి గ్రామాన్ని ఆయన సందర్శించారు. గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల పథకంలో భాగంగా చేపడుతున్న పనులను పరిశీలించారు. అనంతరం గ్రామ పంచాయతీలో రికార్డులను తనిఖీచేశారు, నర్సరీని పరిశీలించారు. వనమహోత్సవ కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని, నాటిన మొక్కల సంరక్షణకు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో సూచించారు. కార్యక్రమంలో ఉపాధిహామీ సిబ్బంది, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

బోనుకు చిక్కిన 28 కోతులు !



బోనుకు చిక్కిన కోతులు ఇవే..

కమ్మర్‌పల్లి, ఆగస్టు 30: మండల కేంద్రంలో కొంతకాలంగా కోతులు ఇల్లు పీకి పందిరేయడంతోపాటు పలువురిని తీవ్రంగా గాయపరుస్తూ నష్టపర్చడం తో అటవీ అధికారులు, వీసీడీ సభ్యులు చేపట్టారు. స్థానిక అ టవీశాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన బోనులో సుమారు 28 కోతులు చిక్కాయి. అలాగే స్థానిక ఉన్నత పాఠశాలలోని చెట్లపై తిష్టవేసి విద్యార్థులను భయ భ్రాంతుల కు గురిచేస్తున్న కోతులను పట్టేందుకు పాఠశాలలోనే ప్రత్యేక బోను ఏర్పాటు చేశారు. ఈ కోతులను పట్టేందుకు ఆంధ్రాకు చెందినవారితో ఒప్పందం చేసుకుని ప్రతీ కోతికి రూ.400, కోతులకు ఎరగా వేసేందుకు పుట్నాలు, పల్లీ లు, అరటిపండ్లు, భోజనసదుపాయాలను స్థానిక గ్రామాభివృద్ధి కమిటీ ఏర్పా టు చేస్తోంది. బోనులో చిక్కిన కోతులను సమీప అటవీ ప్రాంతాలలో కాకుండా ఇచ్చోడ అటవీ ప్రాంతంలోని కోతుసంరక్షణ కేంద్రానికి తరలించేందుకు ఒప్పందం చేసుకున్నారు. కొంతకాలంగా దాడులు చేస్తూ తీవ్రంగా గాయపరుస్తూ, ఆస్తులకు, పంటలకు నష్టం కలిగిస్తున్న కోతుల బెడద తీరనుండడంతో గ్రామ ప్రజలు పలువురు హర్షంవ్యక్తం చేస్తున్నారు.

ఆర్మూర్‌లో ఫ్రైడే డ్రైడే కార్యక్రమం

ఆర్మూర్‌టౌన్, ఆగస్టు30: పట్టణంలోని వివిధ కాలనీల్లో శుక్రవారం వైద్య శాఖ అధికారులు ఫ్రైడేడ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. అశోక్‌నగర్, రాంనగర్, శాస్త్రీనగర్, కమలానెహ్రూకాలనీ, జెమ్మన్‌జెట్టిగల్లీలో వైద్యసిబ్బందికి ఇంటింటికీ తిరుగుతూ వర్షపునీరు నిల్వ ఉండకుండా చూడాలని ప్రజలకు అవగాహన కల్పించారు. వర్షాకాలంలో కూలర్లు, పాతటైర్లు, కొబ్బరిచిప్పాలు, నీటికుండీలు, ఇతర పాడైన వస్తువులలో ఉండే నీటి నిల్వలను తొలగించాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ ఫిర్దోస్‌ఫాతిమ, సూపర్‌వైజర్ శాంత, హెల్త్ అసిఒస్టెంట్ ఆనంద్, బట్టు శ్యామల, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధమవ్వాలి

ఆర్మూర్‌రూరల్, ఆగస్టు30: రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు బీజేపీ కార్యకర్తలు సిద్ధం వావాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కలిగోట గంగాధర్ అన్నారు. ఆలూర్ మండల కేంద్రంలో శుక్రవారం బీజేపీ సభ్యత్వ నమోదు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైఆయన మాట్లాడుతూ అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో కృషి చేసిన విధంగానే పార్టీ సభ్యత్వాన్ని విజయవంతం చేయాలన్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం ఆచారణకు సాధ్యంకానీ హామీలుఇచ్చి ప్రజలను మోసగిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్య క్షుడు గంగాధర్, ఆర్మూర్ అసెంబ్లీ సభ్యత్వ కన్వీనర్ గంగోని సంతోష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆలయ స్వాగత తోరణానికి భూమిపూజ

వేల్పూర్, ఆగస్టు 30: మండలంలో ముదిరాజ్‌లకు ఆరాధ్య దైవంగా నిలుస్తున్న పెద్దమ్మతల్లి ఆలయ స్వాగత తోరణానికి (కామన్)కు శుక్రవారం డీసీసీబీ చైర్మన్ కుంట రమేష్‌రెడ్డి భూమిపూజ చేశారు. వేల్పూర్ నుంచి పచ్చలనడ్కుడ వెళ్లే ప్రధాన రోడ్డు సమీపంలో పెద్దమ్మతల్లి ఆలయానికి వెళ్లే రోడ్డుకు స్వాగత తోరణ నిర్మాణానికి భూమిపూజ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం దేవాలయాల్లో భక్తులకు అన్నివిధాలా సౌకర్యాల ఏర్పాటుకు కృషి చేస్తోందని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, ముదిరాజ్ సంఘం సభ్యులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత

ముప్కాల్, ఆగస్టు 30: బాల్కొండ మండల కేంద్రంలోని సీఎంఆర్ఎఫ్ చెక్కులను కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం లబ్ధిదారులకు కాంగ్రెస్ నాయకులు చెక్కులను అందజేశారు. బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ ముత్యాల సునీల్‌కుమార్‌కు చొరవతో సీఎంఆర్ఎఫ్ చెక్కులు మంజూరు చేసినందుకు బాధితులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కోడిచర్ల రామకృష్ణ, శేక్ అఫ్సర్, కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

బేహరాన్‌లో ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు

కమ్మర్‌పల్లి, ఆగస్టు30: శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు బేహరాన్‌లోని శ్రీకృష్ణ మందిరంలో శుక్రవారం ఘనంగ నిర్వహించారు. బేహరాన్‌లోని హిందూ కమిటీ, తెలుగు కళా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొని మిరామీడ్ పద్దతిలో ఉట్టికొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు రెడ్డి ప్రసాద్, అరవింద్ బుద్ధదేవ్ నర్సయ్య, కలాలిభానుచెందర్ పాల్గొన్నారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

ఎడపల్లి, ఆగస్టు 30: ప్రేమ విఫలమైందన్న కారణంతో పోచారం గ్రామంలో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నట్లు ఎడపల్లి ఎస్సై వంశీకృష్ణా రెడ్డి తెలిపారు. గ్రామస్థులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎడపల్లి మండలం పోచారం గ్రామానికి చెందిన మోరె దీపక్ (20) తన ప్రేమ విఫలం కావడంతో కొంతకాలంగా మానసికంగా కుంగిపోయాడు. జీవితం మీద విరక్తి చెంది శుక్రవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బోధన్ ఏరియా జిల్లా ఆస్పత్రికి తరలించారు. మృతుడి తల్లి మోరె లత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బాల్కొండలో అంతర్ పాఠశాలల క్రీడా పోటీలు

ముప్కాల్, ఆగస్టు 30: బాల్కొండ మండల కేంద్రంలో సెప్టెంబర్ 2వ తేదీ నుంచి 4 వరకు మూడు రోజుల పాటు ఉమ్మడి బాల్కొండ మండలంలోని అంతర్ పాఠశాల విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు ఎంఈవో బట్టు రాజేశ్వర్ తెలిపారు. చదువుతో పాటు క్రీడల్లో నైపుణ్యం పెంపొందించేందుకే క్రీడలు నిర్వహిస్తున్నామని, క్రీడల ప్రారంభోత్సవానికి బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి హాజరుకానున్నట్లు బాల్కొండ పాఠశాల యాజమాన్యం తెలిపింది.

రుణమాఫీ కాని రైతులు

కుటుంబ వివరాలిచ్చి సహకరించాలి



రైతుల కుటుంబ వివరాలు సేకరిస్తున్న అధికారులు



మాట్లాడుతున్న ఏడీఏ శ్రీనివాస రాజు

ఎడపల్లి, ఆగస్టు 30: రుణమాఫీ కాని రైతులు తమ కుటుంబ కుటుంబ వివరాలను నోడల్ అధికారికి వెల్లడించి సహకరించాలని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు మహమ్మద్ అబ్దుల్‌అలీం అహ్మద్ కోరారు. శుక్రవారం ఎడపల్లి మండలంలోని జైతాపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో నోడల్, మండల వ్యవసాయ అధికారి సిద్ది రామేశ్వర్ కుటుంబ నిర్ధారణ లేని రైతుల కుటుంబ వివరాలను సేకరించారు. కార్యక్రమాన్ని ఏడీఏ పరిశీలించి ఎంత మంది రైతులకు రుణమాఫీ కాలేదో వివరాలను నోడల్ అధికారిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల తమ కుటుంబ వివరాలను వెల్లడించి అధికారులకు సహకరించాలని అన్నారు. కార్యక్రమంలో వారితోపాటు పంచాయతీ కారోబార్ రహమత్, రైతు కృష్ణారావు తదితరులు ఉన్నారు.

కమ్మర్‌పల్లి: ఉప్లూర్ గ్రామంలోని రైతు వేదికలో నిర్వహించిన రైతుల కుటుంబాల నిర్ధారణ సర్వేను భీమ్‌గల్ ఏడీఏ శ్రీనివాస రాజు సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతుల ఆధార్‌కార్డులు, బ్యాంక్ అకౌంట్‌లపేర్లు పోలి లేనిఎ రైతులు తమ వివరాలను సెప్టెంబరు 7 లోగా సంబంధిత బ్యాంక్‌లకు వెళ్లి సరిచేయించుకోవాని, బ్యాంక్ వారికి లాగిన్ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో మండల ఇన్‌చార్జ్ ఏవో రమ్యశ్రీ, ఏఈవోలు జి రమేష్, సాయిరాంరాజు రైతుల వివరాలను సేకరించి నిర్ధారించారు. ఈ కార్యక్రమాలు నిర్ధారించిన తేదీల్లో జరుగుతాయని ఏవో రమ్యశ్రీ తెలిపారు. 31న కమ్మర్‌పల్లి, 2 సెప్టెంబరు హసాకొత్తూర్, 3న బషీరాబాద్, 4న అమీర్‌నగర్, 5న కోనాసమందర్, 6న నార్సాపూర్, 9న కోనాపూర్, కొత్తచెరువుతండా, 10న ఇనియత్ నగర్ డీసీ తండా, 11న చౌట్‌పల్లి, 12న బషీరాబాద్, 13 రాజరాజేశ్వరినగర్ (ఆర్ఆర్‌నగర్) గ్రామాలలో కుటుంబ నిర్ధారణ కార్యక్రమాలు ఉంటాయని వెల్లడించారు.

ప్రజలను ఇబ్బందులకు గురిచేయొద్దు: ఆర్మూర్ ఎమ్మెల్యే



కార్యాలయాన్ని తనిఖీ చేస్తున్న ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి

ఆర్మూర్ రూరల్, ఆగస్టు 30: కమీషన్లు ఇవ్వాలంటూ మున్సిపల్ అధికారులు తమ వేధిస్తున్నారని పలువురి బాధితులు ఫిర్యాదు చేయడంపై ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి స్పందించి ప్రజలను ఇబ్బందులకు గురిచేయొద్దని అధికారులు హెచ్చరించారు. ఆర్మూర్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి తనిఖీ చేశారు. కార్యాలయంలో టౌన్ ప్లానింగ్, వివిధ విభాగాలను తనిఖీ చేశారు. మున్సిపల్ పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనులను కమిషనర్ రాజును అడిగి తెలుసుకున్నారు. కొందరు మున్సిపల్ అధికారులు కమీషన్ అడుగుతున్నారని వినాయక విగ్రహాల తయారీదారులు ఫిర్యాదు చేశారు. ఒక్కోషెడ్డుకు తైబజార్ రుసుము రూ.4వేలు చెల్లించినా మున్సిపల్ అధి కారులు రూ.30 వేలు చెల్లించాలని నోటీసులు ఇచ్చారని ఎమ్మెల్యేకు వివరించారు. దీంతో ఎమ్మెల్యే మున్సిపల్ కార్యాలయానికి వెళ్లి అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే సహించేదిలేదన్నారు. వినాయక విగ్రహాల తయారీకి ప్రభుత్వ స్థలాన్ని కేటాయిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ఆయనవెంట బీజేపీ నాయకులు ఉన్నారు.

‘బీడీ కార్మికులకు రూ.4వేల జీవనభృతి ఇవ్వాలి’

వేల్పూర్, ఆగస్టు30: ఎన్నికల సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించినట్టు ఎలాంటి అంక్షాలు లేకుండా బీడీ కార్మికులకు రూ.4వేల జీవనభృతిని అమలుచేయాలని తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్రకార్యదర్శి ముత్తెన్న డిమాండ్‌చేశారు. శుక్రవారం వేల్పూర్ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట యూనియన్ జిల్లానాయకుడు అర్వింద్ ఆధ్వర్యంలో బీడీ కార్మికులతో ధర్నా నిర్వహించారు. అంతకుముందు వేల్పూర్‌లో ప్రధాన రహదారిపై బీడీ కార్మికులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ముత్తెన్న మాట్లాడుతూ బీడీపరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులందరికీ చేయూత పథకం కింద రూ.4వేల ఇస్తామని రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని అమలుచేయాలని కోరారు. అనంతరం డిమాండ్‌లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ సంతోష్‌కు అందజేశారు. కార్యక్రమంలో తెలంగాణ ప్రగతిశీల బీడీవర్కర్స్ యూనియన్‌జిల్లా ఉపాధ్యక్షురాలు సత్తెమ్మ, జిల్లానాయకులు కార్మికులు పాల్గొన్నారు.

ఓటుహక్కు నమోదుపై ఇంటింటి సర్వే

కోటగిరి, ఆగస్టు 30: పొతంగల్ మండలకేంద్రంలో ఓటుహక్కు నమోదుపై శుక్రవారం తహసీల్దార్ మల్లయ్య ఇంటింటి సర్వేను ప్రారంభించారు. అంగన్‌వాడీ టీచర్లు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలు సేకరించారు. గ్రామంలోని లేని వారివి, 18 ఏళ్లు నిండిన వారి వివరాలు సేకరించారు. ఓటరు జాబితాలో తప్పులు ఉంటే సవరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐ సాయిలు, సిబ్బంది వెంకటేష్, బీఎల్‌వోలు, అంగన్‌వాడీ టీచర్‌లు పాల్గొన్నారు.

పాఠశాలలో సరస్వతి విగ్రహ ఆవిష్కరణ

జక్రాన్‌పల్లి, ఆగస్టు 30: మండలంలోని బాల్‌నగర్ పాఠశాలలో శుక్రవారం సరస్వతి విగ్రహాన్ని ఆవిష్కరించారు. బాల్‌నగర్ గ్రామానికి చెందిన కొమిరె రాజు సరస్వతి విగ్రహాన్ని ఏర్పాటుచేయగా ఉపాధ్యాయులు, గ్రామస్థులు కలిసి ఆవిష్కరించారు.

సుంకెట్‌లో పేకాటరాయుళ్ల అరెస్టు

మోర్తాడ్, ఆగస్టు 30: మండలంలోని సుకెట్‌లో పేకాడుతున్న స్థావరంపై దాడిచేసి 8మంది పేకాటరాయుళ్లను అరెస్టు చేశామని ఎస్సై విక్రమ్ తెలిపారు. శుక్రవారం రాత్రి మకు అందిన సమాచారం మేరకు పేకాటస్థావరంపై దాడిచేయశామని పేకాట అడుతున్న వారినుంచి రూ.12,170, 8 సెల్‌ఫోన్లు, కారు, రెండు బైక్‌లు స్వాధీనం చేసుకుకుని కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఫ్రైడేను డ్రైడేగా పాటించాలి

ఎడపల్లి, ఆగస్టు30: ప్రతీ గ్రామ పంచాయతీలో ఫ్రైడేను డ్రైడేగా పాటించాలని ఇన్‌చార్జీ డీఎల్‌పీఓ మధుకర్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఎమ్మెస్సీ ఫారం గ్రామ పంచాయితీని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ శుక్రవారం డ్రైడేగా పాటిస్తూ సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, దోమల నివారణ కోసం మురుగుకాల్వలో, నాళాల్లో ఫాగింగ్ చేపట్టి ఆయిల్ బాల్స్‌ను వేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆయనతోపాటు మండల పంచాయతీ అధికారి మన్‌మోహన్ శర్మ, పంచాయతీ కార్యదర్శి రాజు, కారోబార్ కృష్ణ ఉన్నారు.



ఎమ్మెస్సీఫారం జీపీని పరిశీలిస్తున్న డీఎల్‌పీవో మధుకర్



సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ శ్రీనివాస్

వినాయక చవితి పండుగను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలి

● ఏసీపీ శ్రీనివాస్

రెంజల్/నవీపేట,ఆగస్టు 30: వినాయక చవితి పండుగను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని బోధన్ ఏసీపీ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండలంలోని సాటాపూర్ గ్రామంలోని రైతు వేదికలో ఎస్సై సాయన్న ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శాంతి కమిటీ సమావేశంలో పాల్గొని ఆయన మాట్లాడుతూ కుల, మతాలకు అతీతంగా ప్రజలందరూ సోదరభావంతో వినాయక చవితి పండుగను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలన్నారు. ఎటువంటి తారతమ్య భేదాలు లేకుండా కలిసికట్టుగా పండుగలు జరుపుకోవడంతో స్నేహభావం పెంపొందిందుతుందని, ప్రతీ పండుగను సోదరభావంతో జరుపుకుని ఒకరికొకరు స్నేహభావం పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రావణ్ కుమార్, ఎంపీడీవో శ్రీనివాస్, ఎస్సై సాయన్న, ట్రాన్స్‌కో ఏఈ రాజలింగం, పంచాయతీ కార్యదర్శి రాజేందర్‌రావు, వివిధ గ్రామాల నుంచి వచ్చిన మతపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తెలుగుభాష దినోత్సవం

బోధన్‌రూరల్, ఆగస్టు30: దేశభాషలందు తెలుగు లెస్సా అనేలా ఖండతరాలు దాటిన మన తెలుగు భాష మరువరాదని తెలుగు భాషలో ఉన్న మృదుత్వం, మాధుర్యం చాలా రమణీయమైనదని ఎందరో మహనుభావులు కవులుగా ప్రాచుర్యం పొందారని పంప సాహితీ పీఠం ప్రతినిధులు పురాణే అజయ్ కుమార్ అన్నారు. శుక్రవారం బోధన్ పట్టణంలోని ఇందూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో తెలుగు భాష దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పంప సాహితీపీఠం ప్రతినిధులు రాజేశ్వర్, కాట్రగడ్డ భారతి, 5వ జ్యూడిషియల్ జడ్జి శేషతల్ప సాయి, తదితరులు పాల్గొన్నారు.

మంత్రులను కలిసిన కాంట్రాక్టు అధ్యాపకులు

డిచ్‌పల్లి, ఆగస్టు30: తమను రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ టీయూ కాంట్రాక్టు అధ్యాపకులు శుక్రవారం హైదరాబాద్‌లో రాష్ట్ర మంత్రులు శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్సీ కోదండరామ్‌లకు వినతిపత్రం అందజేశారు. త్వరలో తమ సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని, ఆ ఫైల్ సీఎం పేషీలో ఉందని మంత్రులు హామీఇచ్చారని కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు డా.దత్తహరి తెలిపారు. మంత్రులను కలిసనవారిలో గంగాకిషన్, కిరణ్ రాథోడ్, రాజేశ్వర్, శ్రీనివాస్, నాగేశ్వరరావు, గోపి, కాకతీయ వర్సిటీ, ఓయూ, కాంట్రాక్టు అధ్యాపకులు పాల్గొన్నారు.



మంత్రి పొంగులేటికి వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

దేశ సుస్థిర అభివృద్ధికి

పునరుత్పాదక ఇంధన వనరులను కాపాడాలి



మాట్లాడుతున్న సైంటిస్ట్ చంద్రశేఖర్

డిచ్‌పల్లి, ఆగస్టు30: తెలంగాణ వర్సిటీలో శుక్రవారం తెలంగాణ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో డా.సత్యనారాయణ అధ్యక్షతన జాతీయసైన్స్‌డే నిర్వహించారు. ఈ సందర్భంగా భారత రక్షణ శాఖ పరిశోధన, అభివృద్ధి సంస్థ డీఆర్‌డీవో నాగపూర్ సీనియర్ సైంటిస్ట్ చంద్రశేఖర్ సుస్థిర అభివృద్ధి పునరుత్పాదక వనరుల పాత్ర అనే అంశంపై కీలక ఉపన్యాసం చేశారు. సౌరశక్తి, పవన శక్తి, జల శక్తిలను కాపాడుకోవాలన్నారు. ప్రకృతికి హానిచేసే వ్యర్థాలను క్లోరో, ఫ్లోరో కార్బన్‌లు పొర దెబ్బతినడంతో అతినీలలోహిత కిరణాలు భూమికి చేరి మానవుల్లో క్యాన్సర్‌కు దారి తీస్తాయన్నారు. సెల్యూలోజ్ సహజ రసాయలను, హరిత రసాయనాలను పునరుత్పాదక వనరులను ఉపయోగించుకొని మానవ సుస్థిర అభివృద్ధికి పాల్పడాలన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ యాదగిరి మాట్లాడుతూ మానవ మనుగడకు శాస్త్రసాంకేతిక రంగాల్లో జరిగే నూతన ప్రయోగాలే దోహదం చేస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆరతి, నోడల్ ఆఫీసర్ ప్రొ.వాసంచంద్రశేఖర్, డా.ప్రసన్నశీల, డా.పున్నయ్య, అసిస్టెంట్ ప్రొఫెసర్‌లు డా.శరత్, నాగేంద్రబాబు, రామేశ్వర్ రెడ్డి అపర్ణ, నర్సయ్య, రమ్య, విద్యార్థులున్నారు.



భూమిపూజ నిర్వహిస్తున్న బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

వంతెన నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ

నవీపేట, ఆగస్టు30: మండల కేంద్రంలోని మోడల్ పాఠశాల సమీపంలోని అలీసాగర్ కాల్వపై రూ.12లక్షలతో నిర్మించే వంతెన నిర్మాణానికి శుక్రవారం బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మోడల్ పాఠశాల విద్యార్థులు, ఇందిరమ్మ కాలనీవాసులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతగా ఓ పుష్పగుచ్చాన్ని అందజేశారు. అనంతరం పాలిటెక్నిక్ కళాశాలకు వెళ్లి విద్యార్థులు, ఉపాధ్యాయులతో ఎమ్మెల్యే మాట్లాడారు. కళాశాలలోని సమస్యలను పరిష్కరిస్తానని ఆయన హామీఇచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూఅకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, శ్రీనివాస్‌గౌడ్, రాజేందర్ గౌడ్, గోవర్ధన్ రెడ్డి, మోస్రా సాయిరెడ్డి, భగవాన్, చల్లా రవీందర్, సంజీవరెడ్డి, ఇరిగేషన్ డీఈ బలరాం, ఏఈ శ్రీధర్‌లు ఉన్నారు.

● పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలి

నవీపేట మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో పారిశుధ్య నిర్వహణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి పంచాయతీ కార్యదర్శి రవీందర్ నాయక్‌ను ఆదేశించారు. శుక్రవారం నవీపేట గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించారు. గ్రామంలో పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా, వీధిలైట్ల ఏర్పాటు వంటి సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఆర్మూర్ మున్సిపల్ కమిషనర్ ఆకస్మిక తనిఖీ

● శుభ్రత పాటించని టిఫిన్ సెంటర్లకు జరిమానా

ఆర్మూర్‌టౌన్, ఆగస్టు30: పట్టణంలో పలు వార్డుల్లో మున్సిపల్ కమిషనర్ రాజు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. పలు వార్డుల్లో జరుగుతున్న పారిశుధ్య పనులతో పాటు టిఫిన్ సెంటర్‌లను కమిషనర్ రాజు పరిశీలించారు. శుభ్రత పాటించని టిఫిన్ సెంటర్‌లకు జరిమానా విధించారు. ఆయన వెంట మున్సిపల్ శానిటరీ ఇన్స్‌పెక్టర్ గజానంద్, పర్యవరణ ఇంజనీర్ పూర్ణమౌళి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఖిల్లా కట్టను రక్షించుకునే బాధ్యత అందరిది

● ఆర్మూర్ ఆర్డీవో రాజాగౌడ్

ముప్కాల్, ఆగస్టు 30: అల్లకొండ చరిత్ర చాలా గొప్పదని, రక్షించుకునే బాధ్యత ప్రతీఒక్కరిదని ఆర్మూర్ ఆర్డీవో రాజాగౌడ్ అన్నారు. శుక్రవారం బాల్కొండ మండలకేంద్రంలోని శాంభవి స్కూల్‌లో అల్లకొండ ఖిల్లా పూర్వచరిత్ర అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఆయన బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా బాల్కొండ ఖిల్లా అభివృద్ధి కోసం పురావస్తు శాఖ అధికారులతో సంప్రదించి మరమ్మత్తుల కోసం కలెక్టర్ సహాయంతో నివేదిక ఇస్తామన్నారు. ఖిల్లా గొప్పదనం తెలియజేసేలా విద్యార్థులకు పోటీలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో మోతె రామాగౌడ్, తహసీల్దార్ శ్రీధర్, శాంభవి స్కూల్ చైర్మన్ మధుసూదన్, రాజు, భూసం సత్యనారాయణ, సంతోష్, పవన్, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్ పేలి ఇల్లు దగ్ధం

● త్రుటిలో తప్పిన ప్రాణాపాయం

బోధన్‌రూరల్,ఆగస్టు 30: సాలూర మండలకేంద్రంలో శుక్రవారం రాత్రి 11 గంటల ప్రాంతంలో పొదగండి ఆనంద నివాసంలో ఒక్కసారిగా గ్యాస్ సిలిండర్ పేలింది. దీంతో ఇంట్లో ఉన్న ఇద్దరు కుటుంబ సభ్యులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఒక్కసారిగా గ్యాస్‌సిలిండర్ పేలడంతో కాలనీవాసులు భయాందోళనకు గురైచెలరేగుతున్న మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. గ్యాస్ సిలిండర్ పేలడంతో ఇంట్లోని సామగ్రి కాలిపోగా త్రుటిలో ప్రాణనష్టం తప్పింది. గాయపడ్డ ఇద్దరిని బోధన్ ఆసుపత్రికి తరలించారు.

టీయూలో జాబ్ మేళా

డిచ్‌పల్లి, ఆగస్టు 30: తెలంగాణ విశ్వవిద్యాలయం రసాయన శాస్త్ర విభాగంలో విభాగాధిపతి డా.అడికే నాగరాజు పర్యవేక్షణలో హైదరాబాద్‌లోని హెటిరో డ్రగ్స్ కంపనీ ప్రతినిధులు దుర్గాప్రసాద్, రంగారెడ్డిలు 2022-2024 బ్యాచ్ విద్యార్థులకు జాబ్‌మేళా నిర్వహించారు. ఈ మేళాలో కాకతీయ వర్సిటీ, ఉస్మానియా, జేఎన్‌టీయూ, మహారాష్ట్ర, కేరళ వర్సిటీలకు చెందిన 120 మంది విద్యార్థులు జాబ్‌మేళాలో పాల్గొన్నట్లు నాగరాజు తెలిపారు. హెటిరో డ్రగ్స్ కంపనీ నిర్వహించిన రాత పరీక్ష, మౌఖిక పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన 35మంది విద్యార్థులకు రిజిస్ట్రార్ యాదగిరి, ప్లేస్‌మెంట్ డైరెక్టర్ పాతనాగరాజు నియామకపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆరతి, డా.సాయిలు, డా.బాలకిసన్, నాగేశ్వరరావు, రాజేశ్వరి, గంగా కిషన్, డెనియల్, సురేశ్, నాగేంద్రబాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.

‘పెండింగ్ ఉన్న ఫీజురీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలి’

బోధన్‌రూరల్, ఆగస్టు30: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య మండలసమితి నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని పీఆర్‌టీయూ భవన్‌లో శుక్రవారం అఖిల భారత విద్యార్థి సమాఖ్య మండలసమితి ఆధ్వర్యంలోసమావేశం నిర్వహించారు. డివిజన్ ఇన్‌చార్జి అంజలి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రఘురామ్ మాట్లాడారు. ఫీజురీయింబర్స్‌మెంట్ రాక విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. సంక్షేమ హాస్టళ్లలో చదివే విద్యార్థులకు మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంచాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కార్తీక్, శివాజీ, తరుణ్, అర్చన, సాయిసుప్రియ, రజని, జీవన్, తదితరులు ఉన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

జక్రాన్‌పల్లి, ఆగస్టు30: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు శుక్రవారం నిజామాబాద్‌రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి పంపిణీ చేశారు. జక్రాన్‌పల్లి గ్రామానికి చెందిన 17మంది లబ్ధిదారులకు రూ.7లక్షల 45వేల సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. అలాగే తొర్లికొండ గ్రామానికి చెందిన లబ్దిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీచేశారు. కార్యక్రమంలో మాజీ వైస్ఎంపీపీ జితేందర్‌నాయక్, మాజీసర్పంచ్ కాట్‌పల్లి నర్సారెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి వసంత్‌రావు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

‘అంగన్‌వాడీ కేంద్రంలోని ఆయాను మార్చండి’

బీర్కూర్, ఆగస్టు 30: మండలకేంద్రంలోని 1వ నెంబర్ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారుల తల్లిదండ్రులు, గర్భిణీలు, బాలింతలు శుక్రవారం ఆందోళనకు దిగారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుమలత అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చిన విషయం తెలుసుకున్న పిల్లల తల్లిదండ్రులు, గర్భిణీలు, బాలింతలు అక్కడికి చేరుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చిన పిల్లలను ఆయా ఇష్టారీతిన కొడుతోందని, గర్భిణులు, బాలింతల పట్ల దురుసుగా ప్రవర్తిస్తుందని, కుల వివక్ష చూపుతోందని సూపర్‌వైజర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై సూపర్‌వైజర్‌కు తల్లిదండ్రులు, గర్భిణులు, బాలింతలకు వాగ్వాదం చోటుచేసుకుంది. ఆయాను ఆమెను వేరే కేంద్రానికి మార్చాలని డిమాండ్‌చేశారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని సూపర్‌వైజర్ హామీని ఇవ్వడంతో గొడవ సద్దుమణిగింది.



సూపర్‌వైజర్‌తో మాట్లాడుతున్న పిల్లల తల్లిదండ్రులు

డంపింగ్ యార్డును పరిశీలించిన కలెక్టర్

నిజామాబాద్ అర్బన్, ఆగస్టు 30: జిల్లా కేంద్రంలోని నాగారం శివారులో ఉన్న చెత్త డంపింగ్ యార్డును కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు శుక్రవారం పరిశీలించారు. నగర పాలక సంస్థ పరిధిలో రోజువారిగా ఇంటింటికి తిరిగి సేకరించే చెత్తను డంపింగ్ యార్డు వద్ద నిలువ చేస్తున్న తీరును ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. చెత్త శుద్ధిచేసే ప్రక్రియలో పాల్గొంటున్న కార్మికుల భద్రతా, ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని వారికి అవసరమైన సేఫ్టీ కిట్‌లు అందించి తప్పనిసరిగా వినియోగించేలా చూడాలన్నారు. చెత్తను సేకరించే సమయంలో తడి చెత్త, పొడి చెత్తను వేరువేరుగా తరలించాలని ఈమేరకు ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. కలెక్టర్ వెంట నగర పాలక సంస్థ కమిషనర్ మకరంద్, శానిటేషన్ సిబ్బంది ఉన్నారు.



డంపింగ్ యార్డును పరిశీలిస్తున్న కలెక్టర్, ఇతర అధికారులు

అర్బన్ హెల్త్ సెంటర్ తనిఖీ..

జిల్లా కేంద్రంలోని సీతారాంనగర్ కాలనీలోగల అర్బన్ హెల్త్ సెంటర్‌ను కలెక్టర్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగులకు అందిస్తున్న వైద్య సేవల తీరును పరిశీలించారు. ఆసుపత్రిలోని రిజిస్ట్రేషన్ కౌంటర్, ఔట్‌పేషెంట్, ఇన్‌పేషెంట్ విభాగాలు, వివిధ వార్డులను పరిశీలించారు. మధుమేహం నిర్ధారణ, రక్త పరీక్షలు చేస్తున్న తీరును అడిగి తెలుసుకున్నారు. డెంగ్యూ వ్యాధి నిర్ధారణకు సంబంధించి ర్యాపిడ్ కిట్స్‌ను పరిశీలించి అన్ని సబ్ సెంటర్లు, పీహెచ్‌సీలలో అందుబాటులో ఉండేలా చూడాలని వైద్యాధికారులను ఆదేశించారు. సీజనల్ వ్యాధులకు సంబంధించి అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచాలని ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. కలెక్టర్ వెంట జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిని రాజశ్రీ, డిప్యూటీ డీఎంహెచ్‌వో తుకారాం రాథోడ్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి..

ఇందల్వాయి: సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని డీఎల్‌పీవో శ్రీనివాస్ సూచించారు. శుక్రవారం ఇందల్వాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని చంద్రయాన్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రంలోగల రూప్లానాయక్ తండాలో పరిసరాలను పరిశీలించారు. గ్రామాల్లో డెంగ్యూ జ్వరాలపై ఆరా తీశారు. పరిసరాల పరిశుభ్రత పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ శానిటేషన్ చేయించాలని తెలిపారు. వైద్యాధికారి సంతోష్ ప్రజలకు సీజనల్ వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల ఆరోగ్య విస్తీర్ణ అధికారి శంకర్, ఎంపీవో రాజ్‌కాంత్, ఆరోగ్య కార్యకర్తలు సావిత్రి, ఉదయ, ఆనంద్, తదితరులు ఉన్నారు.

మిషన్ భగీరథ కార్మికులకు వేతనాలు ఇప్పించాలి



వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

ఇందల్వాయి, ఆగస్టు 30: ఇందల్వాయి మండల కేంద్రంలోని మిషన్‌భగీరథ పంప్‌హౌజ్‌లో గత కొంత కాలంగా పనిచేస్తున్నప్పటికీ ఆరు నెలల నుండి ఆపరేటర్లకు వేతనాలు చెల్లించడం లేదని శుక్రవారం నిజామాబాద్ కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం ఇచ్చినట్లు మిషన్ భగీరథ కార్మికులు తెలిపారు. ఎవరెస్ట్ ఇన్‌ఫ్రా ఏజెన్సీ నందు పనులు చేస్తున్నామని తమతో పనులు చేయించుకుంటూ వేతనాలు చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పలుమార్లు ఏఈ, డిఈలకు విన్నవించినప్పటికీ అధికారులు తమపై కనికరం చూపడం లేదని అన్నారు. గత రెండు నెలల నుంచి ఎన్నిసార్లు పంప్‌హౌజ్ ఎదుట నిరసన తెలిపామని అధికారులు సమయం ఇచ్చి వేతనాలు చెల్లిస్తామని చెప్పినప్పటికీ మాట నిలబెట్టుకోవడం లేదని అన్నారు. వేతనాలు రాక కుటుంబ పోషణ భారంగా మారిందని తెలిపారు. కంపెనీ ఏజెన్సీ వారిని జీతాలు అడిగితే ఇష్టం ఉంటే ఉద్యోగం చేయండి లేదంటే మానేయండని మాట్లాడుతున్నారని అన్నారు. గత ఆరు సంవత్సరాల నుంచి మిషన్ భగీరథ పంప్‌హౌజ్‌లో ఆపరేటర్లుగా పని చేస్తున్నామని తమకు పీఎఫ్, ఈఎస్‌ఐ లాంటి కనీస సౌకర్యాలు కల్పించడం లేదని తెలిపారు. తమకు వేతనాలు చెల్లించేవరకు ఆందోళనను చేపడుతామన్నారు. ఆరు నెలల బకాయిలను వెంటనే తమ ఖాతాల్లో జమ చేస్తేనే విధులకు హాజరవుతామని తెలిపారు. కుటుంబ పోషణ భారమవుతుందని వేతనాలు చెల్లించాలని అడిగితే ఏజెన్సీ వారు బెదిరింపులకు పాల్పడుతున్నారని అన్నారు. మిషన్‌భగీరథ పంప్‌హౌజ్‌లో పనిచేసే ఆపరేటర్లకు ఏమి జరిగిన ఎవరెస్ట్ ఇన్‌ఫ్రా ఏజెన్సీ బాధ్యత వహించాలని చెప్పారు. కార్యక్రమంలో మిషన్ భగీరథలో పనిచేసే ఆపరేటర్లందరూ పాల్గొన్నారు.

పోలీసు వ్యవస్థ గులాంగిరీ చేయడం సిగ్గుచేటు

● అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

పెద్దబజార్, ఆగస్టు 30: రాజకీయాలకు సంబంధం లేకుండా స్వయం ప్రతిపత్తితో ప్రజలకు న్యాయం చేయాల్సిన పోలీసు రక్షణ వ్యవస్థ అధికార పార్టీ నాయకులకు గులాంగిరీ చేయడం సిగ్గుచేటని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. పోలీస్ శాఖలో పనిచేస్తున్న సీఐల బదిలీ ఉత్తర్వులు ఇచ్చి మళ్లీ ఆపడంతో ఉన్న మతలబ్ ఏంటో కమిషనర్, ఐజీలు సమాధానం చెప్పాలన్నారు. నగరంలో కొందరు సీఐలపై ఎన్నో అభియోగాలు వస్తున్నా ఏళ్ల తరబడి అదే పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపణలు వస్తున్నా ఎందుకు వారిపై చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ఓడిపోయిన ఎమ్మెల్యే అభ్యర్థి ప్రభుత్వ అన్ని శాఖల్లో తల దూర్చడం వల్లే ఈ తంతు అంతా జరుగుతుందని మండిపడ్డారు. నగరంలో శాంతిభద్రతలపైన సామాన్యులకు న్యాయం చేసే అంశాలపై దృష్టి పెట్టకుండా రాజకీయ నాయకులకు గులాంగిరి చేస్తానంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

మెరుగైన విద్యను అందించేలా కృషి చేయాలి

● జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గాప్రసాద్

నిజామాబాద్ అర్బన్, ఆగస్టు 30: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన, మెరుగైన విద్యను అందించేలా కృషి చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్.వి.దుర్గాప్రసాద్ ప్రధానోపాధ్యాయులు, కాంప్లెక్స్ ఉపాధ్యాయులకు సూచించారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మెరుగైన విద్యాబోధనకు అమలు చేస్తున్న వివిధ పద్ధతులను, పథకాలను పకడ్బందీగా అమలు చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు కృషి చేయాలని, విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం సక్రమంగా అందేలా చూడాలన్నారు. కిచెన్ గార్డెన్‌లు ఏర్పాటు చేయాలని, పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేయాలన్నారు. సకాలంలో విద్యాబోధనతో పాటు ప్రత్యేక తరగతుల నిర్వహణ చేపట్టాలన్నారు. టీచర్ల గైర్హాజరుని తగ్గించుకోవాలని విద్యార్థుల ప్రగతిని ఎప్పటికప్పుడు నమోదు చేయాలన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి వాటి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. విద్యార్థులందరికి యూనిఫామ్‌లు సకాలంలో పంపిణీ చేయాలన్నారు. ఉపాధ్యాయుల కొరత ఉన్నచోట ప్రత్యమ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని ఆయన ఆదేశించారు. ఈ సమావేశంలో పరీక్షల విభాగం అధికారి విజయ్‌భాస్కర్, ఉపాధ్యాయులు, సిఆర్‌పిలు, తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు ఘటనలో ఇద్దరికి జైలు

నిజామాబాద్ లీగల్, ఆగస్టు 30: పోలీస్ కానిస్టేబుల్ విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తికి సంవత్సరం జైలు శిక్ష విధిస్తూ రెండవ అదనపు మొదటి తరగతి మెజిస్ట్రేట్ పి.శ్రీనివాస్ శుక్రవారం నాడు తీర్పు వెల్లడించారు. అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బూసారపు రాజేష్ తెలిపిన వివరాల మేరకు ఆటోనగర్‌కు చెందిన మహ్మద్ మునావర్ 14 నవంబర్ 2018 నాడు సయ్యద్ అహ్మద్ అనే పోలీస్ కానిస్టేబుల్ తన విధుల నిమిత్తం ఆటోనగర్‌లో తిరుగుతుండగా ఇక్కడ ఎందుకు తిరుగుతున్నావు ఇది నా ఏరియా అంటూ అతని విధులకు ఆటంకం కలిగించడంతో ఆరవ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి కోర్టులో దాఖలు పర్చగా జడ్జి తీర్పు వెలువడించారు. ఒక సంవత్సరం పాటు సాధారణ జైలుశిక్ష, మరియు 2వేల రూపాయల జరిమానా విధించారు. జరిమానా కట్టని యెడల మరో రెండు వారాల అదనపు జైలు శిక్ష విధించాలని తీర్పు వెలువరిచారు. అలాగే ప్రభుత్వ అధికారుల విధులకు ఆటంకం కలిగించి చేయి చేసుకున్న మహ్మద్ ఎక్లాక్‌కు సంవత్సరంన్నర జైలు శిక్ష విధిస్తూ రెండవ అదనపు మొదటి తరగతి మెజిస్ట్రేట్ పి.శ్రీనివాస్ శుక్రవారం నాడు తీర్పు వెల్లడించారు. అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బూసారపు రాజేష్ తెలిపిన వివరాల మేరకు 24-12-2018 నాడు ఉత్తర తహశీల్ కార్యాలయం వారి విధుల నిమిత్తం ధరంపురిహిల్స్‌లో రోడ్డుపక్కన ఉన్న షెడ్డులను తొలగించడంతో అదే కాలనీకి చెందిన మహ్మద్ ఎక్లాక్ ఇక్కడికి ఎందుకు వచ్చారు మీకు ఏమి అధికారం ఉందంటూ నెట్టివేసి విఆర్‌ఏ గాజుల చిన్నయ్యను కర్రతీసుకొని కొట్టడంతో ఆర్‌ఐ మహమ్మద్ షహీముద్దీన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా ఆరవ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి కోర్టులో దాఖలు పర్చగా జడ్జి తీర్పు వెలువడించారు. ఒక సంవత్సరంన్నర పాటు సాధారణ జైలుశిక్ష, మరియు 2వేల రూపాయల జరిమానా విధించారు. జరిమానా కట్టని యెడల మరో రెండు వారాల అదనపు జైలు శిక్ష విధించాలని తీర్పు వెలువరిచారు.

లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ

మోపాల్, ఆగస్టు 30: మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి చెక్కులను శుక్రవారం తహశీల్దార్ రామేశ్వర్ తన కార్యాలయంలో అందజేశారు. మండలానికి మంజూరైన 81 కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను గురువారం రోజున రూరల్ ఎమ్మెల్యే తన క్యాంప్ కార్యాలయంలో లబ్ధిదారులకు అందజేశారు. మిగిలిపోయిన వాటిని శుక్రవారం తహశీల్దార్ తన కార్యాలయంలో లబ్ధిదారులను పిలిపించి అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు లబ్ధిదారులు పాల్గొన్నారు.

భర్త నిర్లక్ష్యం వల్లే శిశువు మృతి

పోలీసులకు ఫిర్యాదు చేసిన భార్య అనురాధ

ఖిల్లా, ఆగసు 30: తన భర్త మహేష్ నిర్లక్ష్యం వల్లనే తన 11నెలల శిశువు విష్ణేష్ మృతి చెందాడని మహేష్ భార్య వంగ అనురాధ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు ఐదవ టౌన్ ఎస్‌ఐ గంగాధర్ కేసునమోదు చేసి మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించిన ఘటన శుక్రవారం నగరంలోని నాగారం టేలర్స్ కాలనీలో జరిగింది. వివరాలను ఎస్‌ఐ గంగాధర్ వెల్లడించారు. నగరంలోని నాగారం టేలర్స్ కాలనీకి చెందిన వంగ అనురాధ అత్తతో గొడవకు దిగింది. వీరిద్దరి మధ్య జరిగిన గొడవ అనంతరం తనకు జ్వరం వచ్చిందని చెప్పి కోడలు చికిత్స కోసం ఆస్పత్రికి వెళ్లింది. వెళ్లే ముందు 11నెలల శిశువు విష్ణేష్‌ను ఇంటి వద్దనే వదిలి వెళ్లి పోయింది. అప్పటికే విష్ణేష్ తీవ్ర జ్వరంతో బాధపడుతున్నాడు. చికిత్స చేయించడంలో తండ్రి మహేష్ నిర్లక్ష్యం వహించడం వల్లనే విష్ణేష్ మృతి చెందాడని చికిత్స అనంతరం ఇంటికి వచ్చిన అనురాధ ఆరోపించడంతో పాటు పోలీసులకు ఫిర్యాదు చేసింది. అనురాధ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు ఎస్‌ఐ గంగాధర్ తెలిపారు.

నగరంలో ఆటో అపహరణ

ఖిల్లా, ఆగస్టు 30: నగరంలోని మూడవ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో కంఠేశ్వర్ ప్రాంతంలో గుర్తుతెలియని వ్యక్తులు ఆటోను అపహరించినట్లు మూడవ టౌన్ ఎస్సై యు.మహేష్ తెలిపారు. కంఠేశ్వర్‌కు చెందిన మహ్మద్ ఇమ్రాన్ అనే వ్యక్తి తన ఆటో నెంబర్ ఇఎస్16యుసి8484 ను ఇంటి ముందర గురువారం రాత్రి పార్క్ చేసి నిద్రపోయాడు. శుక్రవారం ఉదయం లేచి చూడగా ఆటో కనబడలేదని ఆటోను దొంగిలించినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

జంబి గద్దె నిర్మాణానికి భూమిపూజ

ఇందల్వాయి, ఆగస్టు 30: మండలంలోని ఇందల్వాయి గ్రామంలో దసరా సందర్భంగా ఉత్సవాలు నిర్వహించే జంబి చెట్టు గద్దె నిర్మాణం పనులకు శుక్రవారం గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు శంకుస్థాపన చేశారు. దసరా సందర్భంగా జంబి చెట్టు వద్ద గ్రామస్థులు పూజలు నిర్వహించి ఉత్సవాలు జరుపుతామని, ఇక్కడ కూర్చోవడానికి సరైన స్థలం లేకపోవడంతో గద్దె నిర్మించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ జితేందర్, ఉపాధ్యక్షుడు బాల్‌రెడ్డి, జనార్దన్ ఉన్నారు.



మాట్లాడుతున్న రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

సంఘ సభ్యులకు రుణాలు ఇప్పించాలి

● రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

నిజామాబాద్ అర్బన్, ఆగస్టు 30: మహిళా శక్తి కార్యక్రమాలల్లో మొదటగా సంఘాలలో లేని మహిళలను సంఘాలలో చేర్పించడం, సంఘాలలో ఉన్న సభ్యులకు మైక్రో ఎంటర్‌ప్రైజెస్ వారికి ఏర్పాటు చేయాలని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నారు. సంఘాలలో ఉన్న సభ్యులకు పాడి గేదెలు, పౌల్ట్రీ ద్వారా రుణాలు ఇప్పించాలని బ్యాంకుల ద్వారా ఇచ్చే రుణాలు వందకు వంద శాతం ఇప్పించాలన్నారు. నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ స్థాయి సమీక్ష సమావేశాన్ని శుక్రవారం రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి నగరంలోని రాజీవ్‌గాంధీ ఆడిటోరియంలో నిర్వహించారు. సెర్ఫ్, డీఆర్‌డీవో, ఉపాధి హామీ ఉద్యోగులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఎస్‌పీఏ సంఘాలు లేని విధంగా చూడాలని ముఖ్యంగా ఫుడ్‌ప్రాసెసింగ్ సంస్థలు ఏర్పాటు చేయాలన్నారు. స్కూల్ యూనిఫాం ఇంకా ఏమైనా పెండింగ్‌లో ఉంటే పూర్తి చేయాలని, ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా రైతులకు మద్దతు ధర ఇప్పించాలని కోరారు. మహిళలంతా ఆర్థికంగా ఎదిగేలా చూడాలని ఆయన ఆదేశించారు. ఉపాధి హామీ ఉద్యోగులకు నిర్వహించిన సమీక్షలో ప్రతి కూలీకి వంద రోజుల పని కల్పించాలని, 200లకు పైగా కూలీ వచ్చేలా చూడాలన్నారు. మళ్లీ మార్చి నెలలో సమీక్ష నిర్వహించడం జరుగుతుందని అప్పటి వరకు ఇచ్చిన టార్గెట్‌ను పూర్తి చేయాలన్నారు. ఈ సమీక్షలో డిఆర్‌డివో సాయాగౌడ్, ఏపీవో రవీందర్, డిపిఎంలు, ఏపిఎంలు, సిసిలు, వివోఏలు, తదితరులు పాల్గొన్నారు.

గోశాలను సందర్శించిన మున్సిపల్ కమిషనర్

సుభాష్‌నగర్, ఆగస్టు 30: గోశాలకు వచ్చే వరదనీటిని, డ్రైనేజి నీటిని మళ్లింపు చేయాలని మున్సిపల్ నగర పాలక సంస్థ కమిషనర్ మంద మకరంద్ అధికారులను ఆదేశించారు. నగరంలోని నాగారం ప్రాంతంలో ఉన్న గోశాలను శుక్రవారం కమీషనర్ సందర్శించారు. అక్కడి పరిస్థితులను గోశాల నిర్వహకులను అడిగి తెలుసుకున్నారు. డ్రైనేజి, వరదనీరు రావడం వల్ల ఇబ్బందులు కలుగుతున్నాయని తెలపడంతో మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులకు డ్రైనేజి నిర్మాణానికి ప్రణాళిక తయారు చేయాలని కోరారు. వరదనీరు మళ్లింపు చేపట్టాలన్నారు. డ్రైనేజి నిర్మాణానికి ప్రణాళిక తయారు చేసి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ఇంజనీర్ సోలోమాన్, సానిటరి ఇన్స్‌పెక్టర్ ప్రభుదాస్, తదితరులు పాల్గొన్నారు.

నూతన నియామకం

నిజామాబాద్ అర్బన్, ఆగస్టు 30: పీఆర్‌టీయూ తెలంగాణ అనుబంధంగా పీఆర్‌టీయూ తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్స్ రాష్ట్ర కమిటీకి జిల్లాకు చెందిన వసంత్‌రావు నాయక్ ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. శుక్రవారం హైదరాబాద్‌లో పీఆర్‌టీయూ తెలంగాణ వ్యవస్థాపక అధ్యక్షుడు హర్షవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో అనుబంధంగా సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ కమిటీని రాష్ట్రంలోని పాత పది జిల్లాల నుంచి 30 మందికి ప్రాథినిధ్యం కల్పించారు. జిల్లాకు చెందిన వసంత్‌రావు రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, ఉపాధ్యక్షుడిగా అంతేశ్వర్‌లకు అవకాశం కల్పించారు.ఈ సందర్భంగా హర్షవర్ధన్‌రెడ్డి వారిని సన్మానించారు. సంఘ బలోపేతానికి కృషి చేస్తామని వారు తెలిపారు.

లాడ్జితో మహిళతో పట్టుబడ్డ బీఆర్‌ఎస్ కౌన్సిలర్

● దేహశుద్ధి చేసిన కుటుంబీకులు

బోధన్ రూరల్, ఆగస్టు 30: పట్టణంలోని ఓ లాడ్జిలో శుక్రవారం రాత్రి ఓ కౌన్సిలర్.. మహిళతో రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడిన ఘటన కలకలం రేపింది. వివరాల్లోకి వెళితే.. బోధన్ పట్టణంలోని 18వ వార్డు కౌన్సిలర్‌గా బీఆర్‌ఎస్‌కు చెందిన బెంజర గంగారాం కొనసాగుతున్నాడు. ఇతను అదే మండలంలోని ఓ గ్రామానికి చెందిన 32ఏళ్ల మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. శుక్రవారం బోధన్‌లోని ఓలాడ్జీలో సదరు మహిళతో ఉన్నాడు. విషయం తెలుసుకున్న ఆమె కుటుంబీకులు లాడ్జి వద్దకు వచ్చి.. ఇద్దరినీ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఆ తర్వాత కౌన్సిలర్ గంగారాంకు మహిళ కుటుంబీకులు దేహశుద్ధి చేశారు. ఈ ఘటనలో అతనికి స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలికి వచ్చి గాయాల పాలైన కౌన్సిలర్‌ను బోధన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాగా.. ఈ విషయమై సీఐ వీరయ్య మాట్లాడుతూ.. ఘటనపై మహిళా కుటుంబ సభ్యులు ఎలాంటి ఫిర్యాదు చేయలేదన్నారు.

రోడ్డుకు అడ్డంగా వాహనాలు నిలిపితే చర్యలు

ఖిల్లా, ఆగస్టు 30: నిబంధనలకు విరుద్ధంగా, రోడ్డుపై రాంగ్ పార్కింగ్ చేస్తే చట్టప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ వి.వెంకటరమణ హెచ్చరించారు. నగరంలోని రద్దీగా ఉండే ఖలీల్‌వాడి ప్రాంతంలో శుక్రవారం రోడ్లపై నిలిపిన వాహనాలను ట్రాఫిక్ సిబ్బంది తొలగించి వాటిని స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఇన్స్‌పెక్టర్ మాట్లాడుతూ.. రోడ్లపై వాహనాలను నిలపడం వల్ల ప్రజలు తీవ్ర ట్రాఫిక్ సమస్యను ఎదుర్కొంటున్నారని అన్నారు. వాహనదారులు రోడ్లపై వాహనాలను నిలపరాదని సూచించారు. ముఖ్యంగా ఖలీల్‌వాడి ప్రాంతంలో ఏర్పాటు చేసుకున్న ప్రైవేటు ఆస్పత్రుల యజమానులు తమ వాహనాలను రోడ్లపై నిలుపకుండా పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. రోడ్లపై నిలపే వాహనాలపై జరిమానా వేయడం జరుగుతుందన్నారు. పోలీసు కమిషనర్ కల్మేశ్వర్‌సింగేనేవార్ ఆదేశాల మేరకు ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా ప్రతి రోజూ రద్దీగా ఉండే ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్య ను పరిష్కరించే దిశగా కృషి చేయనున్నామన్నారు.

ఘనంగా సీతారాముల కల్యాణోత్సవం

నిజామాబాద్‌కల్చరల్, ఆగస్టు 30: శ్రావణ మాస పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకుని సీతారాముల కళ్యాణం ఘనంగా నిర్వహించారు. నగరంలోని సుభాష్‌నగర్ రామాలయంలో శుక్రవారం ప్రత్యేకంగా అలంకరించిన వేదికపై సీతారాముల విగ్రహాలని ఉంచి కళ్యాణ వేడుకను జరిపారు. అర్చకులు తులసి మురళీధరాచార్య, రాఘవచార్య కళ్యాణ మంత్రాలను పఠిస్తూ కళ్యాణ తంతును నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు శ్రావణ మాస ద్వాదశిని పురస్కరించుకుని శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో పెద్ద ఎత్తున అన్నప్రసాదాన్ని భక్తులకు అందజేశారు. ఈకార్యక్రమంలో సారంగపాణి, శ్యామ్‌సుందరచార్య, వేణుగోపాలచార్య, కలకుంట్ల నర్సింహాచార్య, కృష్ణమచార్య తదితరులు పాల్గొన్నారు.

'హక్కుల సాధన కోసం ఉద్యమించాలి'

సుభాష్‌నగర్, ఆగస్టు 30: ఉద్యోగుల హక్కుల సాధన కోసం ఉద్యమించాల్సిన అవసరం ఉందని టిఎన్‌జివో రాష్ట్ర అధ్యక్షుడు జగదీశ్వర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని టిఎన్‌జివో భవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన జిల్లా టిఎన్‌జివో అత్యవసర కార్యవర్గ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులందరూ సమిష్టిగా పోరాడాలని ఉద్యోగుల పెండింగ్ సమస్యలపై రాష్ట్ర జెఏసి సమావేశంలో చర్చించి ఉద్యమకార్యాచరణ ప్రకటిస్తామన్నారు. ఉద్యోగ లోకం సమిష్టిగా సహకరించి హక్కుల సాధన కొరకు ఉద్యమించేందుకు నడుం భిగించాలని కోరారు. ఈ సందర్భంగా మొదటి సారి జిల్లాకు వచ్చిన రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్, కార్యదర్శి ముజీబ్‌ను టిఎన్‌జివో జిల్లా అధ్యక్షుడు అలుక కిషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి శేఖర్, గైనిగంగారాం, పోల శ్రీనివాస్, అమృత్‌కుమార్, చిట్టి నారాయణరెడ్డి, ఆకుల ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

గణేష్ పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలి

మోపాల్, ఆగస్టు 30: గణేష్ పండుగను గ్రామాల్లో కుల మతాలకు అతీతంగా శాంతియుతంగా జరుపుకోవాలని రూరల్ సీఐ సురేష్ గ్రామస్థులకు సూచించారు. శుక్రవారం మోపాల్ పోలీస్ స్టేషన్ ఆవరణలో గ్రామస్థులతో శాంతి కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గణేష్ పండుగను ప్రజలందరూ శాంతియుతంగా జరుపుకోవాలని కోరారు. గ్రామాల్లో మండపాల వద్ద ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా గ్రామస్థులే జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. పోలీసులు కూడా గ్రామాల్లో పెట్రోలింగ్‌ను విస్తృతంగా చేస్తారని తెలిపారు. మండపాల వద్ద ఒకరిద్దరు నిద్రించాలని కోరారు. అనుమానిత వ్యక్తులు ఎవరైనా కనిపిస్తే పోలీసులకు సమాచారాన్ని అందజేయాలని అన్నారు. నిమజ్జనం రోజు కూడా శాంతియుతంగా జరుపుకోవాలన్నారు. మండలంలోని న్యాల్‌కల్, సిర్పూర్, మోపాల్, కంజర్, కులాస్‌పూర్, చిన్నాపూర్, నర్సింగ్‌పల్లి, ముదక్‌పల్లి, మంచిప్ప, బాడ్సి, కాల్పోల్, బైరాపూర్, అమ్రాబాద్, గుడితాండా, ఎల్లమ్మకుంట, తదితర గ్రామాల నుంచి యువకులను పిలిపించి శాంతి సమావేశాన్ని ఏర్పాటు చేశారు. వీరితో పాటు స్థానిక ప్రజాప్రతినిధులను కూడా పిలిపించారు. సమావేశంలో తహశీల్దార్ రామేశ్వర్, ఎస్సై యాదగిరిగౌడ్, విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఏకకాలంలో రుణమాఫీ చేయాలి

నిజామాబాద్ అర్బన్, ఆగస్టు 30: ఏకకాలంలో రైతులకు ఎలాంటి షరత్తులు లేకుండా రెండులక్షల రుణమాఫీ చేయాలని, రైతుభరోసా వెంటనే అమలు చేయాలని కోరుతూ అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం నాయకులు శుక్రవారం అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు ప్రభాకర్, దేవరాంలు మాట్లాడుతూ అధికారం కోసం ఏ రైతు అడగకముందే ఏకకాలంలో షరత్తులు లేకుండా రెండు లక్షల రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక కేవలం 30 శాతం మంది రైతులకు మాత్రమే రుణమాఫీ చేశారని ఇది రైతులను మోసం చేయడమేనన్నారు. గత ప్రభుత్వం రెండు పంటలకు 10వేల రైతు బందు ఇస్తే తాము వచ్చాక 15వేలు ఇస్తామని ప్రకటించి కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికి రైతుబంధు వేయలేదన్నారు. ధరణి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గువ్వుమ్మల గంగాధర్, రామకృష్ణ, సురేష్, గంగాధర్, బాబన్న, నాగన్న, పాల్గొన్నారు.

చికెన్ ధరలు

రకం	: లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	: రూ.85	రూ.200	రూ. 220
వెన్‌కాబ్(కిలో)	: రూ.95	రూ.205	రూ. 225

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.74,500	రూ.68,700	రూ.900

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

స్క్రీన్-1 : డక్కీ మూవీస్ (12.20)
: సరిపోదా శనివారం (2.50, 6.25, 10.00)
స్క్రీన్-2 : స్త్రీ-2 (హిందీ) (12.15, 3.30, 6.45, 10.00)
స్క్రీన్-3 : కాలం రాసిన కథలు (10.15)
: కమిటీ కుర్రాళ్లు (1.10, 10.45)
: నేను కీర్తన (4.25)
: ఆయ్ మేం ఫ్రెండ్స్ అండి (7.40)
స్క్రీన్-4 : సీతారాం సిత్రాలు (10.10)
: డిమోంటి కాలనీ-2 (1.00, 10.30)
: తంగలాన్ (4.05)
: అహో విక్రమార్క (7.25)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1: సరిపోదా శనివారం (1.00, 4.10, 7.20, 10.30)
స్క్రీన్-2 : ఆయ్ మేం ఫ్రెండ్స్ అండి (10.20)
: కమిటీ కుర్రాళ్లు (1.30, 7.30)
: తంగలాన్ (4.30)
: డిమోంటి కాలనీ-2 (10.30)
స్క్రీన్-3 : స్త్రీ-2 (హిందీ) (10.20, 7.20)
: డిమోంటి కాలనీ-2 (1.30)
: ఆయ్ మేం ఫ్రెండ్స్ అండి (4.30)
: తంగలాన్ (10.20)

దేవి : తంగలాన్ (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్: కమిటీ కుర్రాళ్లు (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : మిస్టర్ బచ్చన్ (11.15, 2.15, 6.15, 9.15)
లలితామహల్ : సరిపోదా శనివారం (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్